## కథ

**"అపర్ణా మేడమ్! మీకు ఫోన్" రిసీవర్ పక్కన పెడుతూ చెప్పాడు సహోద్యోగి.**

**లేచి వెళ్లింది అపర్ణ.**

**"హలో"**

**"నమస్తే! నా పేరు విశ్వనాథ్. నేను రాసిన లెటర్ అందిందా?"**

**"అందింది" చెప్పిందామె.**

# శుభరాత్రి

''నా గురించి వివరాలు రాశాను. ఇంకేమైనా సందేహాలుంటే అడగండి.''

''ఏమీ లేవు''

''మీరేమీ అనుకోనంటే ఓ చిన్న ప్రశ్న. ఈ పెళ్లి సంబంధం పట్ల మీరు ఎందుకు ఇంటరెస్ట్ చూపుతున్నారో తెలుసుకోవచ్చా?''

అతని ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పలేకపోయింది.

ఒక్క ముక్కలో జవాబు చెప్పే ప్రశ్న కాదది.

''మీకు వీలైతే సాయంత్రం ఆరు గంటలకు మా ఇంటికి రాగలరా? ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడం కంటే ఇంటి దగ్గర అయితే సావకాశంగా అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు'' చెప్పింది.

''అలాగే'' అన్నాడతను కొద్ది క్షణాలు తర్వాత.

ఇంటి అడ్రస్ చెప్పి ఫోన్ పెట్టేసింది.

ఆంధ్రభూమి వీక్లీలో పెళ్లిపిలుపు శీర్షికలో అతని ప్రకటన చూసి తన ఆఫీసు అడ్రసు, ఫోన్ నెంబరు ఇస్తూ తాను ఆసక్తి చూపుతున్నట్టు ఉత్తరం రాసింది.

అపర్ణ రాసిన ఉత్తరానికి అతని నుండి నిన్న జవాబు అందింది. ఇప్పుడు ఫోన్ చేశాడు.

తన సీటులో కూర్చుని బ్యాగ్‌లో నుండి అతను రాసిన లెటరు బయటకి తీసింది.

ఇప్పటికి ఆ ఉత్తరం మూడు, నాలుగుసార్లు చదివిందామె.

గౌరవనీయులైన అపర్ణగారికి,

ఆంధ్రభూమిలో నా ప్రకటన చూసి మీరు ఉత్తరం రాయడం ఆశ్చర్యం అనిపించింది.

నా పూర్తి వివరాలు రాస్తున్నాను.

కేంద్ర ప్రభుత్వంలో గ్రేడ్ వన్ ఆఫీసర్ ఉద్యోగం. వయసు 33 సంవత్సరాలు. ఇద్దరు పిల్లలు. రెండోసారి డెలివరీలో కాంప్లికేషన్స్ వల్ల నా భార్య మరణించింది.

రెండో పెళ్లివాడిని, ఇద్దరు బిడ్డల తండ్రిని అయిన నన్ను పెళ్లి చేసుకోవడానికి మీరు ఎందుకు ఇంటరెస్ట్ చూపుతున్నారో నాకు అర్థం కాలేదు.

పెళ్లి అయిన తరువాత రెండో భార్య మోజులో పడి పిల్లల్ని అశ్రద్ధ చేసే వ్యక్తిని కాను. పిల్లల్ని నా కంటిరెప్పలా పెంచుకోవాలని నా కోరిక. ఇందుకు నా రెండో భార్య సహకారం కూడా కావాలి. మీరు ఇందుకు సిద్ధపడితే మనం పర్సనల్‌గా కలుసుకుని మాట్లాడుకుందాం.

సెలవు.

-విశ్వానాథ్.

చక్కటి దస్తూరీతో తనకు ఎటువంటి అమ్మాయి భార్యగా కావాలని ఆశిస్తున్నాడో సూటిగా రాశాడు.

ఉత్తరం మడిచి బ్యాగ్‌లో పెట్టింది.

అతనితో ఇప్పుడు ఫోన్‌లో మాట్లాడిన తరువాత ఆమె మనసులో అలజడి. సాయంత్రం అతన్ని కలుసుకోబోతున్నందుకు ఒకింత టెన్షన్ కలిగింది.

అలజడిని అణచుకుంటూ పనిలో నిమగ్నమైందామె.

సాయంత్రం-

స్నానం చేసి వచ్చి నుదుట తిలకం దిద్దుకుంటుండగా డోర్ బెల్ మోగింది. తలుపు తీసింది.

''అపర్ణగారు ఉన్నారా?'' అడిగాడతను.

''నేనే. లోపలికి రండి'' చిరునవ్వుతో ఆహ్వానించింది.

''ఇంట్లో ఎవరూ లేరా?'' సోఫాలో కూర్చుంటూ అడిగాడు.

''నాన్నగారు, నేను ఉంటున్నాము. నాన్న వాకింగ్‌కు వెళ్లారు. కొద్దిసేపట్లో వస్తారు'' మంచినీళ్లు అందిస్తూ చెప్పింది.

''అమ్మ...?'' ప్రశ్నార్థకంగా చూశాడు.

''అమ్మ రెండేళ్ల క్రితం చనిపోయింది. అక్కకు పెళ్లయింది. బెంగుళూరులో ఉంటారు'' తమ కుటుంబం గురించి క్లుప్తంగా చెప్పింది.

**మోహన రెడ్డి**

''ఆర్థిక స్తోమత లేని ఆడపిల్లల తండ్రులు రెండో పెళ్లి వాడి కోసం వెతుకుతారు సాధారణంగా. కానీ మంచి విద్యార్హత, హోదా గల ఉద్యోగంలో ఉన్న మీరు ఈ పెళ్లి పట్ల ఎందుకు ఇంటరెస్ట్ చూపుతున్నారో తెలుసుకోవచ్చా?'' డైరెక్ట్‌గా విషయంలోకి వచ్చాడతను.

ఉదయం ఫోన్‌లో కూడా ఇదే ప్రశ్న అడిగాడు.

తన బిడ్డలను అక్కున చేర్చుకుని ఆదరించే స్త్రీమూర్తిని భార్యగా పొందాలని అతని తపన.

అపర్ణవైపు తదేకంగా చూస్తున్నాడు విశ్వనాథ్. చక్కని మేని వర్ణంతో, నిరాడంబరంగా, హుందాగా ఉంది అనుకున్నాడు.

తనను పరిశీలనగా చూస్తున్న విశ్వనాథ్‌ను చూసి ఒక్క క్షణం ఇబ్బందిగా ఫీలైంది.

నెమ్మదిగా, స్పష్టంగా మాట్లాడుతోందామె.

''నాకు పిల్లలంటే చాలా ఇష్టం. ఒక్కరిద్దరు పిల్లలు ఎలా సరిపోతారు? ఇంటికి కనీసం నలుగురు పిల్లలైనా ఉంటే ఆడుకోడానికి, కొట్టుకోడానికి బావుంటుంది అని నేను అప్పుడప్పుడు అంటుంటే మా అమ్మ, నాన్న, అక్క నవ్వేవారు నా మాటలకు. నేను నలుగురు పిల్లల్ని కంటాను అని తమాషాగా చెప్పినప్పుడు గత ఏడాది డెలివరీకి వచ్చిన మా అక్క నవ్వటం నాకు బాగా గుర్తు.''

కొద్ది క్షణాలు తల దించుకుని మౌనంగా ఉండిపోయింది అపర్ణ.

''పిల్లల తండ్రి అయిన మిమ్మల్ని పెళ్లి చేసుకోడానికి ఎందుకు సిద్ధపడ్డానో కారణం చెబుతాను. కొద్ది రోజుల క్రితం నాకు గైనిక్ ప్రోబ్లెమ్ వచ్చింది. మా ఫ్రెండ్ వాళ్ల అక్క నాగమల్లిక దగ్గరకు వెళ్లాను. ఆమె మంచి పేరున్న గైనకాలజిస్ట్. అన్ని టెస్టులు చేశారు.

మూడు వారాల పాటు మందులు వాడితే నయమవుతుందని చెప్పింది కానీ అంతకు మించి మరేం చెప్పలేదు. అసలు విషయం చెప్పమని నేను పట్టుబట్టాను. నాకున్న గైనిక్ లోపం వల్ల పిల్లలు కలిగే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆమె చెప్పింది. మరో డాక్టర్ అయితే పేషెంట్‌కు పెళ్లికి ముందు ఈ విషయం చెప్పి ఉండేవారు కాదేమో బహుశ. కానీ ఆ డాక్టర్‌తో ఉన్న చనువు వల్ల నేను పట్టుబట్టడంతో ఈ విషయం చెప్పింది.

ఊహించని ఆ మాటలకు నేను ఉక్కిరిబిక్కిరయ్యాను. జీవితం నిస్సారంగా అనిపించింది. అంతకుముందు రెండు, మూడుసార్లు పెళ్లిచూపులు కూడా జరిగాయి. కానీ ఏ సంబంధం నిశ్చయం కాలేదు. పెళ్లికి ముందు ఈ విషయం తెలియడం మంచిదే అయింది అనుకున్నాను.

బిడ్డల్ని కనే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయన్న సంగతి దాచిపెట్టి పెళ్లి చేసుకుంటే భర్తను



మోసం
చేశానన్న బాధ జీవితాంతం దహిస్తుంది. అందుకే ఇక ఈ జన్మకు పెళ్లి ఊసెత్తకూడదనుకున్నాను. ఈ మాట చెబితే నాన్న తట్టుకోలేరేమో అనిపించింది. వీలు చూసుకుని చెబుదామనుకున్నాను.

ఈలోగా మీ ప్రకటన చూశాను. వెంటనే నా మనసులో ఒక ఆలోచన కలిగింది. పెళ్లి చేసుకోవాలన్న తలంపును విరమించుకోవటం కంటే పెళ్లయి భార్యను కోల్పోయిన మీ జీవితంలోకి రెండో భార్యగా ప్రవేశించడం వల్ల మీకు భార్యగాను, పిల్లలకు తల్లిగాను ఉంటే నా జీవితానికి పరిపూర్ణత కలుగుతుందనిపించింది. అందుకే ధైర్యం చేసి మీకు ఉత్తరం రాశాను.''

అప్పటివరకు తల వంచుకుని మాట్లాడిన అపర్ణ తలెత్తి అతనివైపు చూసింది.

ఆమె మీద నుండి చూపులు మరల్చుకున్నాడు విశ్వనాథ్.

''మెడికల్ రిపోర్ట్స్ చూస్తారా?'' లేచి గదిలోకి వెళ్లి రిపోర్ట్స్ తీసుకురాబోయింది.

''అవసరం లేదు'' వారించాడతను. ''పరాయి వ్యక్తి అయిన నా దగ్గర ఈ సంగతి చెప్పడానికి మీరు ఎంత మధనపడ్డారో నాకు అర్థమైంది. విషయం చెప్పాక కూడా రిపోర్ట్స్ చూసి మీకు మరింత ఇబ్బంది కలిగించను. ఎదుటి మనిషిని బాధ పెట్టే వ్యక్తిని కాదు.''

అతని సంస్కారానికి ముగ్ధురాలైందామె.

పక్కనే ఉన్న ఫోన్ తీసుకుని నెంబర్ డయల్ చేసి అవతలి వ్యక్తితో మాట్లాడింది.

''నాగమల్లిక గారితో మాట్లాడండి. ఈలోగా నేను టీ తయారుచేసి తెస్తాను.''

రిసీవర్ అతనికి అందించి కిచెన్‌లోకి నడిచింది.

''నమస్తే. నా పేరు నాగమల్లిక. గంట క్రితం అపర్ణ ఫోన్ చేసి మీ పెళ్లి సంబంధం గురించి చెప్పింది. మీరు ఈ పెళ్లికి అంగీకరిస్తే వాళ్ల ఫాదర్‌కు చెప్పి ఆయనను కూడా కన్విన్స్ చేయమని నన్ను కోరింది. తను మీకు అసలు విషయం చెప్పే ఉంటుంది. అపర్ణకు సంతానం కలిగే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. కానీ ఆమెతో మీరు దాంపత్య జీవితం గడపడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆలోచించుకుని మీ నిర్ణయం చెప్పండి. మీరు అంగీకరిస్తే అపర్ణ తండ్రితో కూడా మాట్లాడి ఆయనను ఒప్పించడానికి ప్రయత్నిస్తాను.''

''నేను ఈ పెళ్లికి ఇష్టపడుతున్నాను'' చెప్పాడు విశ్వనాథ్ ఫోన్‌లో.

''మంచిది. నేను రాత్రికి అపర్ణతోను, ఆమె ఫాదర్‌తోను మాట్లాడతాను'' అతన్ని అభినందించి ఫోన్ పెట్టేసింది డాక్టర్ నాగమల్లిక.

మరో రెండు నిమిషాల్లో టీ తీసుకొచ్చింది అపర్ణ. నిశ్శబ్దంగా ఉందామె.

తన గురించి వివరంగా చెప్పింది. డాక్టర్‌తో మాట్లాడడానికి కూడా అవకాశం కల్పించింది. ఇక నిర్ణయం తీసుకోవడం అతని వంతు అనుకుంది మనసులో.

అతన్ని చూస్తోంటేనే యోగ్యుడు, సంస్కారవంతుడులా ఉన్నాడు. 'ఈ మాచ్ కుదిరితే బాగుంటుంది' ఆమె మనసులో అపురూపమైన భావం కలిగింది.

''ఈ పెళ్ళికి నేను ఇష్టపడుతున్నాను. కానీ నాదొక చిన్న సందేహం'' టీపాయ్ మీద కప్పు పెడుతూ అన్నాడు.

''చెప్పండి'' ఆమెలో సంతోష కెరటం ఉవ్వెత్తున లేచింది.

''ఉద్యోగం చేస్తున్న మీరు పిల్లల ఆలనాపాలనా చూడగలరా అనిపిస్తోంది. మిమ్మల్ని ఈ పెళ్లి అనే జంఝాటంలోకి తీసుకువెళ్లి ఇద్దరు పిల్లలతో...'' ఇక మాట్లాడలేకపోయాడతను.

''ఉద్యోగం చేస్తున్న మహిళలు పిల్లల్ని పెంచలేరని మీ అభిప్రాయమా? వాళ్లకు ఎలాంటి లోటు కలుగకుండా పెంచగలనని నాకు నమ్మకముంది.''

ఆమె స్వరం నుండి స్థిరమైన మాటలు వెలువడ్డాయి.

ఇక అతని మనసులో ఎలాంటి సంశయమూ లేదు.

''ఊరి నుండి అమ్మను, నాన్నను రమ్మని చెబుతాను.''

''థాంక్యూ'' ఆమె గొంతులో ఆనందం క్లియర్‌గా తెలుస్తోంది.

ఇక ఏం మాట్లాడాలో తోచలేదతనికి.

''నేను బయల్దేరుతాను'' లేచాడు.

''నాన్నగారు వాకింగ్ నుండి వచ్చే టైమైంది.''

''రేపు ఆయనను కలుస్తాను'' బైక్ స్టార్ట్ చేశాడు విశ్వనాథ్.

మరో పది రోజుల్లో-

దైవ సాన్నిధ్యంలో అతని ఇల్లాలైందామె.

నవ వధువుగా అతని ఇంట్లో అడుగు పెడుతూనే అయిదు నెలల వయసున్న పాప పింకీని ఎత్తుకుని అరచేతుల్లో ముద్దు పెట్టుకుంది.

మూడేళ్ల వయసున్న పవన్‌ను నడిపించుకుంటూ వచ్చి అపర్ణ చేతికందించింది వృద్ధురాలైన విశ్వనాథ్ తల్లి.

''ఇంతకాలం పిల్లలు నా దగ్గర ఒకరు, వాళ్ల అమ్మమ్మ దగ్గర ఒకరు పెరిగారు. ఇప్పుడు ఇద్దరినీ తీసుకొచ్చి నీకు అప్పగిస్తున్నాను. జాగ్రత్తగా చూసుకోమ్మా'' చెప్పిందామె.

ఆకలికి ఏడుస్తోన్న పాపాయిని సముదాయిస్తోంది అపర్ణ. ఆమె చేతిలో పాల సీసా పెట్టింది అత్తగారు.

పాలు తాగిన పాపాయి కళ్లు నిద్ర వచ్చి మూతపడ్డాయి.

న్యూస్‌పేపర్‌ను ముక్కలు చేసి రాశిగా పోస్తున్నాడు పవన్. వాడిని వారించి ఆడుకోడానికి బొమ్మలు ముందు పెట్టింది. కాస్సేపు వాటితో ఆడుకున్నాడు.

అన్నం కలిపి తీసుకొచ్చి పవన్‌కు తినిపించింది అపర్ణ. కొంచెం తిని ఇక చాలన్నాడు. బతిమిలాడినా లాభం లేకపోయింది. కొద్దిసేపయ్యాక చక్కెర కేళి తినిపిస్తే ఇష్టంగా తిన్నాడు.

ఆ రోజు చాలా త్వరగా గడిచిపోయినట్లనిపించింది. పిల్లలతో గడపడంలోను, వాళ్ల బాగోగులు చూడడంలోను ఉన్న ఆనందాన్ని చవిచూస్తోందామె.

తనకు కనిపించని పిల్లల కన్నతల్లిని మనసులో స్మరించుకుంది.

ఆమె ఎలా ఉంటుందో తెలియదు తనకు. ఆర్ద్రంగా ఆమెను తలుచుకున్న వెంటనే అపర్ణ కళ్లలో నీళ్లు నిలిచాయి. ఆమె లేని లోటు తెలియకుండా పిల్లల్ని పెంచి పెద్ద చేయాలని అనుకుంది.

నిద్రలేచి ఏడుస్తోన్న పాపాయిని ఉయ్యాలలో నుండి తీసి ఎత్తుకుంది.

పని మీద బయటకి వెళ్లిన విశ్వనాథ్ ఇంట్లోకి వచ్చాడు. మనోహరమైన దృశ్యం కనిపించింది అతనికి.

గోడకు ఆనుకుని కాళ్లు చాపి కింద కూర్చుంది అపర్ణ.

ఆమె కాళ్లమీద వెచ్చగా పడుకుని నిద్రపోతోంది పాపాయి.

అపర్ణ భుజం మీద చేయి వేసి ఊగుతూ వచ్చీరాని మాటలు చెబుతున్నాడు పవన్.

విశ్వనాథ్‌ను చూసి కొంచెం ముందుకు వంగి కాళ్ల మీద పైకి జరిగిన చీరను సరిచేసుకుంది.

ఆమె కొంచెం ముందుకు కదలడం వల్ల భుజం మీద చేయి వేసి ఊగుతున్న పవన్ కింద చతికిలబడ్డాడు. వాడిని దగ్గరగా లాక్కుంది.

ఆమె చీర మడతల్లో దోబూచులాడుతున్న పవన్‌ను తీసుకుని నిద్రబుచ్చాడు విశ్వనాథ్.

''భోజనం చేద్దామా? ఇప్పటికే చాలా ఆలస్యమైంది'' అన్నాడు.

''అలాగే'' పాపను పడుకోబెట్టి మస్కిటోనెట్ పెట్టింది.

ఇద్దరూ భోజనం చేశారు.

ఆమె శరీరం ఒకింత అలసటగా ఉంది. అలసటలోనే సంతృప్తి. జీవితానికి పరిపూర్ణత కలిగిన ఫీలింగ్. మాతృత్వంలోని మాధుర్యాన్ని మానసికంగా సంపూర్ణంగా ఆస్వాదించడం వల్ల కలిగిన అనుభూతి అది.

మంచం మీద ఆమె పక్కన కూర్చున్నాడు విశ్వనాథ్.

''థాంక్స్'' అన్నాడు.

''ఎందుకు?'' ఆశ్చర్యంగా అడిగింది.

అతను జవాబు చెప్పలేదు. ఆమె రెట్టించలేదు.

'నీలోని అమ్మతనానికి నా కృతజ్ఞతలు' మనసులో అనుకున్నాడు.

కొద్ది నిమిషాల తర్వాత ఆమె చెంపల మీద మృదువుగా చేతులు వేసి తనవైపు తిప్పుకున్నాడు.

అర్ధరాత్రి మెలకువ వచ్చి లేచి టైమ్ చూసింది. ఒంటి గంట దాటింది. 'పాపకు ఆకలి అవుతుందేమో' ఆ ఊహ కలిగిన వెంటనే కిచెన్‌లోకి వెళ్లి పాలు కలిపి తీసుకొచ్చి మంచం పక్కన పెట్టింది.

అలికిడికి లేచాడు విశ్వనాథ్.

''లేచావెందుకు? నిద్ర పట్టడం లేదా?'' అడిగాడు.

''పాపాయికి ఆకలవుతుందేమో అని పాలు కలిపి తీసుకొచ్చాను. కాని నిద్రపోతుంటే లేపడం ఇష్టం లేక ఊరుకున్నాను'' చెప్పింది.

ఆమె మాటలు అర్థమైనట్లుగా పాప నిద్ర లేచి ఆకలికి సన్నగా ఏడవటం ప్రారంభించింది.

మంచం మీద నుండి లేచి పాపను తీసుకొచ్చి ఆమెకందించాడు.

పక్క గదిలో నుండి వచ్చి లోపలికి చూసిన విశ్వనాథ్ తల్లి సంతృప్తిగా వెనుదిరిగింది.

ఆకలి తీరి ప్రశాంతంగా నిద్రపోతోంది పింకీ.

లైటు తీశాడతను.

నిద్రకుపక్రమించింది అపర్ణ.

''ఈ జీవితంలో ఎలాంటి శుభ ఘడియలు ఉండవనుకున్నాను. భర్తతోను, పిల్లలతోను ఆనందంగా గడుపుతున్న ఈ రాత్రి నాకు నిజంగా శుభరాత్రి. నాకు ఇంతటి అదృష్టాన్ని ప్రసాదించినందుకు కృతజ్ఞతలు'' తన ఆరాధ్య దైవాన్ని తలచుకుంటూ విశ్వనాథ్‌కు మరింత చేరువగా జరిగి పడుకుంది.

ఆమె భావం గ్రహించిన వాడిలా అపర్ణ చుట్టూ చేయి వేసి దగ్గరగా లాక్కున్నాడతను.

